## దేవక్కాపేట్ అడవిలో పులి సంచారం

రెండు ఆవులపై దాడి చేసి చంపిన వైనం

ట్రాప్ కెమెరాల్లో చిక్కిన సంచరిస్తున్న పులి

గ్రామ పొలిమేర వరకు వచ్చి వెళ్ళిందని ఆందోళనలో గ్రామస్థులు






భీమ్ గల్, బతుకమ్మ: గత మూడు రోజులుగా కమ్మర్ పల్లి రేంజ్ అడవుల్లో సంచరిస్తున్న పులి దేవక్కాపేట్ అడవిలో ప్రత్యేక్షమయ్యింది. గురువారం దేవక్కాపేట్ గ్రామంలో రెండు ఆవులపై దాడి చేసి చంపింది. మహారాష్ట్రలోని తాడోభ అడవుల నుండి వచ్చిన పులి జిల్లాల్లోని సిరికొండ రేంజ్ అడవుల్లో సంచారిస్తూ కమ్మర్ పల్లి రేంజ్ అడవుల్లోకి వచ్చింది. మానాల ప్రాంతంలో పులి సంచారాన్ని గమనించిన స్తానికులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. విశ్వాశనీయ సమాచారం అందుకున్న అటవీ అధికారులు పులి కోసం అడవిలో గాలించగా పులి అడుగులను గుర్తించి, పులి సంచారాన్ని గుర్తించారు. పులిని కనుగొనెందుకు గత మూడు రోజులుగా గాలిస్తున్న జాడ దొరకపోగా దేవక్కాపేట్ అడవిలో పులి ప్రత్యేక్షమయ్యింది. దేవక్కాపేట్ అడవిలో ఆవులను దాడి చేసి చంపగా, పులి ఈ అడవిలోనే సంచరిస్తున్న పుటేజ్ అటవీ అధికారులు అడవిలో అమర్చిన ట్రాప్ కెమెరాలో చిక్కింది. ధీంతో ఇక్కడే పులి సంచారాన్ని గుర్తించిన అధికారులు పులి కోసం అడవిలో ముమ్మరంగా గాలిస్తున్నారు. పులి గ్రామం పొలిమేర వరకు వచ్చిపోయిన ఆనవాళ్ళను గుర్తించిన స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు తీపి కబురు

మంత్రి పొన్నంతో ప్రత్యేక కమిటీ బేటి

త్వరలో జిల్లాల వారిగా సర్వేలు, అధ్యయనం



హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు దిశగా కీలక అడుగు పడింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ లు ప్రొఫెసర్ కోదండరాం, డాక్టర్ అద్దంకి దయాకర్ మినిస్టర్ క్వార్టర్స్ లో భేటీ అయ్యారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే అంశంపై మినిస్టర్ క్వార్టర్స్ లో జరిగిన ప్రాథమిక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ పాల్గొన్నారు. ఉద్యమ కారుల సమస్యల పరిష్కారానికి, హామీల అమలుకు ఒక సమర్థవం తమైన కమిటీని ఏర్పాటు చేయడంపై ప్రాథమికంగా చర్చించారు. ఈ కమిటీలో మహిళలకు, వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో అసలైన ఉద్యమకారులను గుర్తించేందుకు జిల్లా వారీగా సర్వే నిర్వహించాలని, వారి డిమాండ్లపై సమగ్ర అధ్యయ నం చేయాలని నేతలు భావించారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి అర్హత ప్రమాణాలు, విధివిధానాలు ఎలా ఉండాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశంపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ సాధనలో ఉద్యమ కారుల త్యాగాలు వెలకట్టలేనివని, వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుకే పారదర్శకమైన విధానంతో అర్హులం దరికీ న్యాయం చేస్తామన్నారు. వచ్చే వారం మరోసారి సమావేశమై కమిటీ సభ్యుల ఎంపిక అమలు ప్రణాళికపై స్పష్టతనివ్వాలని నేతలు నిర్ణయించారు. ఈ సమావేశం ఉద్యమకారుల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తోంది.

# నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ ప్రపంచంలోని అన్ని సంస్కృతులను ఆహ్వానిస్తాయి

దేశంలో ముంబై తర్వాత హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి గురువారం ప్రారంభించారు. ఐలైన్ స్టూడియో ప్రారంభంతో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో హైదరాబాద్ విప్లవాత్మకమైన మార్పులకు వేదిక కానుంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ తరుణం వచ్చేసిందని, నెట్‌ఫ్లిక్స్ హైదరాబ ాద్‌కు వచ్చేసిందన్నారు. తెలంగాణ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో సరిపడా పరిమాణంలో నెట్‌ఫ్లిక్స్ విస్తరణ కోసం స్థలం కేటాయిస్తామని, అవసరమైతే నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు రిలొకేట్ చేయాలని కోరారు. ఒకప్పుడు బ్లాక్ అండ్ వైట్ నుంచి టెక్నోకలర్, అక్కడి నుంచి ఈస్ట్‌మన్ కలర్, తర్వాత 70 ఎంఎం, డాల్బీ, అక్కడి నుంచి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందని, ఈ ప్రాంతానికి టాలీవుడ్, బాలీవుడ్ కాకుండా హాలీవుడ్ కూడా రావాలని మొదటి నుంచి బలంగా కాంక్షిస్తునన్నారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్‌లో ఏర్పాటు కావాలన్నది మా ఆకాంక్ష అని, 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. మీ పెట్టుబడులకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుందని, నెట్‌ఫ్లిక్స్ ప్రపంచానికి వినోదం అందించాలని చూస్తోందని, మేం ప్రపంచాన్ని సుసంపన్నం చేయాలని చూస్తున్నామని, మీకూ మాకు మధ్యన సారూప్యత ఉందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వీక్షకుల కోసం ట్యాలెంట్, కంటెంట్‌ను నెట్‌ఫ్లిక్స్ అందిపుచ్చుకుంటే, హైదరాబాద్ అవకాశాలు, ప్రపంచ నైపుణ్యతను కలిగి ఉందని, మనం వారధి లాంటివాళ్లమని, మార్పును ఆశించే వాళ్లమని, డీవీడీలను అద్దెకు సమకూర్చే స్థాయి నుంచి ఓటీటీలో ప్రపంచ లీడర్‌గా నెట్‌ఫ్లిక్స్ ఎదిగిందన్నారు. ఫుడ్, ట్రావెల్, వారసత్వం, సంస్కృతి విషయాల్లో ప్రజలు నెట్‌ఫ్లిక్స్ ను, హైదరాబాద్‌ను ప్రేమిస్తారని, ప్రపంచ వీక్షకులకు తెలంగాణను విశ్వవ్యాప్తం చేయడంలో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ ఫెసిలిటీ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ ఈ మధ్య కాలంలో స్పోర్ట్స్ పై దృష్టిని సారించిందని, స్పోర్ట్స్ లో ఈ సంస్థ అతిపెద్ద బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ కాబోతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అన్ని స్థాయిల్లో ట్యాలెంట్‌ను గుర్తించాలన్న లక్ష్యంతో క్రీడల పట్ల, క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పామని, మీకూ మాకూ ఎంతో సారూప్యత కలిగిన నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ – హైదరాబాద్ రెండూ కలిసి మంచి విజయాలను సాధించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐలైన్ స్టూడియో సీఈఓ జెఫ్ షపిరో, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, సినీ నటుడు, నిర్మాత రాణా దగ్గుబాటి, తెలంగాణ ఫిలిం డెవల్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తో పాటు నెట్‌ఫ్లిక్స్ కు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# గోవింద్ పేట్ పీ.హెచ్.సీ ని తనిఖీ చేసిన కలెక్టర్





ఆర్మూర్, బతుకమ్మ :ఆర్మూర్ మండలం గోవింద్ పేట్ లో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును గమనించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. వివిధ వార్డులను సందర్శించి రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను గమనించారు. బ్లడ్ శాంపిల్స్ సేకరిస్తూ, మధుమేహం, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ, వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

పీ.హెచ్.సీ లో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న కలెక్టర్, ఆయా విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు శిబిరానికి హాజరయ్యారా అని ఆరా తీశారు. ఈ తరహా ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ముందస్తుగానే సమాచారం చేరవేయాలని సూచించారు. ఆర్థోపెడిక్, గైనిక్, డెంటిస్ట్, జనరల్ ఫిజీషియన్ తదితర విభాగాల ద్వారా ప్రత్యేక శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కస్తుర్బాగాంధీ, జ్యోతిబాపూలె విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలలో కూడా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన కార్యక్రమాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ తదితరులు ఉన్నారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం...

ఆగిన రోడ్డు నిర్మాణ పనులు

రైతులకు తప్పని తిప్పలు

రుద్రూర్ బతుకమ్మ :జిల్లాలోని పలు గ్రామాలల్లో రోడ్డు పనులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల నత్తనడకన సాగుతున్నాయి. రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామ శివారు నుండి పంట పొలాలకు వెళ్లే మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ. 50 లక్షలతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్తానిక మండల నాయకులతో కలిసి భూమి పూజ చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంకా ఇప్పటివరకు రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను ఇంకెప్పుడు పూర్తి చేస్తారని నెల క్రితం పలు పత్రికల్లో వార్తా కథనాలు రావడంతో మెటల్ రోడ్డుకు సంబంధించిన మెటీరియల్స్ తీసుకువచ్చి రోడ్డుపై వేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. ఆ మెటీరియల్స్ ను రోడ్డుకు అడ్డంగా వేయడంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెటీరియల్స్ ను రోడ్డుపై వేయడంతో 20 రోజుల్లో వరి పంటలు



చేతికొస్తాయని, వరి కొత మిషిన్లు, లారీలు పొలం వద్దకు రావడానికి మరింత ఇబ్బంది ఎదురవుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనుల పై కాంట్రాక్టర్ ఎందుకింత



నిర్లక్ష్యంగా వహిస్తున్నారని అర్థం కాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ వెంటనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని రైతులు కోరారు.